# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక :144 ప్రచురణ : హైదరాబాద్ సోమవారం,6-04-2026 పేజీలు: 8 వెల : 3- 00


## రాజేంద్రనగర్‌లో తెలంగాణ కొత్త హైకోర్టు...

# శంకుస్థాపన చేసిన సీజేఐ

**రాజేంద్రనగర్‌లో తెలంగాణ హైకోర్టు జోన్-2 భవనానికి శంకుస్థాపన**

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా కార్యక్రమం**

**ప్రజాస్వామ్యానికి ప్రతీకగా కొత్త భవనం నిలుస్తుందన్న సీఎం రేవంత్**

**2027 డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం**




తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్-2 భవన నిర్మాణానికి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఆదివారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హాజరయ్యారు. ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ అంకురార్పణ కార్యక్రమం తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేకమైన రోజు అని ముఖ్యమంత్రి అభివర్ణించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ, ఒక కోర్టు సముదాయాన్ని నిర్మించడం అంటే కులమతాలకు అతీతంగా ప్రజల కోసం ఒక పవిత్ర స్థలాన్ని నిర్మించడమేనని అన్నారు. "ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులకు చివరి ఆశ, నమ్మకం న్యాయస్థానమే. అటువంటి న్యాయస్థానాన్ని నిర్మించే అవకాశం మా ప్రభుత్వానికి రావడం అదృష్టంగా భావిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.ఈ కొత్త హైకోర్టు భవనం ప్రజాస్వామ్యానికి ఒక ప్రతీకగా నిలుస్తుందని, న్యాయం కోసం వచ్చే పేదలు, బలహీనులకు భరోసా ఇస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2027 డిసెంబర్ నాటికి ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం స్పష్టం చేశారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ ఎస్.వి. భట్టి, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి ఇబ్బందులు రానివ్వద్దు



రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి వనరుల సంరక్షణ, రబీ పంటల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. రబీ సీజన్ చివరి దశలో ఉన్న పంటలకు చివరి వరకూ నీరందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆదివారం మంత్రి ఉన్నతాధికారులతో అత్యవసర ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న నీటిని వినియోగించడంతోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన, మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువుల్లో సమగ్ర డీసిల్టేషన్, డీసెడిమెంటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. లభ్యమయ్యే నీటిని సమర్థంగా వినియోగించడంలో చీఫ్ ఇంజినీర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆదేశించారు. నిల్వ ఉన్న పంటలు ఎండిపోకుండా కాపాడటం, తాగునీటి అవసరాలకు తగిన నిల్వలను సంరక్షించడం రెండు ప్రధాన ప్రాధాన్యతలుగా తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారులు స్వయంగా ముందుండి పరిస్థితులను అంచనా వేసి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని 6.30 లక్షల ఎకరాల ఆయకట్టులో ఇప్పటికే రబీ సీజన్‌లో పంటలకు సాగునీరు అందించామని అధికారులు తెలిపారు. కోతలు పూర్తయిన ప్రాంతాలను మినహాయించి ఇంకా తడి అవసరమైన పంటలకు తప్పనిసరిగా నీరు అందించాలని మంత్రి ఆదేశించారు. కాల్వలు మూసే ముందు తాగునీటి అవసరాల కోసం చెరువులు, ట్యాంకులు పూర్తిగా నింపాలని అధికారులను ఆదేశించారు.

**జూరాల ప్రాజెక్టు మరమ్మతులకు వేగం**

జూరాల ప్రాజెక్టు మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.66 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, నారాయణపూర్ నుంచి పునరుత్పత్తి నీటిగా 0.5 టీఎంసీలు చేరే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు. ప్రవాహాలు ఆలస్యమైతే 0.5 టీఎంసీల లోటు ఏర్పడే అవకాశం ఉన్నదని చెప్పారు. గతేడాది కర్ణాటక నుంచి ఒక టీఎంసీ నీటిని సమీకరించిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. జూరాల వంతెన నిర్మాణ స్థలాన్ని ఖరారు చేయాలని మంత్రి ఆదేశించారు. వంతెనతోపాటు చిన్న బ్యారేజ్ నిర్మాణానికి అనుకూలంగా సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. మరోవైపు.. రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్లో డీసిల్టేషన్ చేపట్టాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. చెరువులు, ప్రాజెక్టులపై ప్రాథమిక సాధ్యత నివేదికలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

దేశవ్యాప్తంగా అనేక ప్రాజెక్టుల్లో 30-40 శాతం వరకు మట్టి పేరుకుపోయినట్లు సర్వేలు చెబుతున్నాయని, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు శాస్త్రీయ పద్ధతిలో డీసిల్టేషన్ చేయాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే.. పెద్ద పంప్‌హౌస్‌లను నిరంతరంగా నడపాలని, తరచూ ఆన్-ఆఫ్ చేయడం వల్ల యంత్రాలకు నష్టం కలిగే అవకాశం ఉన్నదని మంత్రి తెలిపారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణపై సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహిస్తున్న అధ్యయనాల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో సాగునీటి శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ ఇంజినీరింగ్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంజనీర్ ఇన్ చీఫ్ రమేష్ బాబు, వివిధ ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్‌కు కేరాఫ్ హైదరాబాద్ ..

# 16 మెడల్స్ సాధించిన చరిత్ర మనది




ఒకప్పుడు ఫుట్ బాల్ కు హైదరాబాద్ సెంటర్ గా ఉండేదన్నారు సీఎం రేవంత్ రెడ్డి. 1950 నుంచి 1970 మధ్య కాలంలో హైదరాబాద్ పోలీస్ టీమ్ ఏకంగా 16 మెడల్స్ సాధించిందని ఆయన కొనియాడారు. దేశానికి ఎంతో మంది అగ్రశ్రేణి ప్లేయర్లను అందించిన ఘనత మన నగరానిదేనని స్పష్టం చేశారు.హైదరాబాద్ వేదికగా జరిగిన ఆలిండియా పోలీస్ ఫుట్ బాల్ పోటీలు ముగిశాయి. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కాసేపు పోలీసులతో కలిసి ఫుట్ బాల్ ఆడారు . ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. 34 టీమ్స్ పాల్గొన్న ఈ మెగా టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన పోలీస్ శాఖను అభినందిస్తూ, క్రీడాకారులందరికీ తన శుభాకాంక్షలు తెలియజేశారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నానని చెప్పారు రేవంత్. ఇందులో భాగంగానే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఒలింపిక్స్‌లో మన దేశం మరిన్ని బంగారు పతకాలు సాధించాల్సిన అవసరం ఉందని ఆయన ఆకాంక్షించారు.

ప్రస్తుతం యువత పబ్ కల్చర్, డ్రగ్స్, సైబర్ నేరాల బారిన పడటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దేశభక్తికి నిలయమైన పంజాబ్ వంటి రాష్ట్రాల్లో కూడా డ్రగ్స్ కేసులు పెరగడం విచారకరమన్నారు. డ్రగ్స్ మహమ్మారిని అరికట్టి దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై, యువతపై ఉందన్నారు.ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద

తీసుకురావడం ద్వారా పేద విద్యార్థులకు కూడా ఆయనతో ఆడే అరుదైన అవకాశాన్ని తమ ప్రభుత్వం కల్పించిందని సీఎం చెప్పారు. క్రీడల్లో రాణించే వారికి అండగా ఉంటామన్న రేవంత్.... నిఖత్ జరీన్, మహ్మద్ సిరాజ్ వంటి క్రీడాకారులకు గ్రూప్-1 ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

# దేశంలోనే సక్సెస్‌ఫుల్ స్టార్టప్ స్టేట్ తెలంగాణ





స్వతంత్ర భారతదేశంలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అమెరికా న్యూయార్క్ నగరంలోని ప్రతిష్టాత్మక కొలంబియా బిజినెస్ స్కూల్‌లో నిర్వహించిన 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌కు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఉద్దేశించి తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని వివరించారు. కేసీఆర్ నాయకత్వంలో పరిపాలన, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనమన్నారు. తాము అవకాశాల కోసం ఎదురుచూడలేదని.. వాటిని అందిపుచ్చుకునేందుకు అద్భుతమైన పాలసీలను తయారు చేశామని తెలిపారు. తద్వారా పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించి వృద్ధిని సాధించామని పేర్కొన్నారు. 2027లో భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధమవుతున్న వేళ, కేవలం పదేళ్లలోనే తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతి గర్వకారణమని అన్నారు.రాష్ట్రాలే దేశాభివృద్ధికి ఇంజన్లు అన్న ప్రాథమిక విషయాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. భారతదేశం 28 ఇంజిన్లు కలిగిన ఒక ఫార్ములా 1 రేసింగ్ కార్ లాంటిదన్నారు. 2014 నుండి 2023 మధ్య కాలంలో తెలంగాణ సాంకేతిక రంగం సాధించిన గణాంకాలను కేటీఆర్ వివరించారు. ఐటీ ఎగుమతులు రూ.57వేల కోట్ల నుండి రూ.2.72 లక్షల కోట్లకు పెరిగాయని.. ఐటీ ఉద్యోగాల సంఖ్య 3.23 లక్షల నుండి దాదాపు 10 లక్షలకు చేరుకున్నదని తెలిపారు. ప్రభుత్వ వేగవంతమైన నిర్ణయాలు, పటిష్టమైన ఎకో సిస్టమ్ కారణంగానే హైదరాబాద్ గ్లోబల్ ఐటీ దిగ్గజాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చెప్పారు. హైదరాబాద్‌లో అమెజాన్ ప్రపంచంలోనే అతిపెద్ద క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందని, గూగుల్, ఆపిల్, మెటా, సేల్స్ ఫోర్స్, ఉబంద

, మైక్రాన్ టెక్నాలజీ వంటి సంస్థలు తమ కీలక కార్యకలాపాలను ఇక్కడ నిర్వహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు చిరునామా తెలంగాణ మారిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ పర్పస్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన 'కాళేశ్వరం' ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని వివరించారు.

## నాదర్‌గుల్ భూములు.. రేవంత్

# అధికారంలోకి వచ్చాకే కబ్జాలు




హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దళితుల భూములను గద్దల్లా తన్నుకుపోతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు (ఝితీఙంష్ఠ ఝశీ) విమర్శించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ భూముల స్కామ్‌లో ప్రభుత్వ పెద్దలు భాగస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. ఈ భూ కుంభకోణం విలువ సుమారు రూ.7 వేల కోట్లు ఉంటుందని చెప్పారు.

"వైఎస్ డిక్లేర్ చేసిన ప్రభుత్వ భూములను కేసీఆర్ కాపాడితే.. రేవంత్‌రెడ్డి భక్షిస్తున్నారు. ఈ వివాదాస్పద భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. మా ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు కూడా సమర్థించింది. ప్రస్తుతం భూభారతిలోనూ ప్రభుత్వ భూములుగానే చూపిస్తోంది. వీటిని కేసీఆర్ హయాంలో ఎవరూ కబ్జా చేయలేదు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే కబ్జాలు మొదలయ్యాయి.నాదర్‌గుల్ భూములను కాపాడేందుకు హైడ్రా ఎందుకు రావట్లేదు? లింగమయ్య గుట్ట సహా దాదాపు 100 ఎకరాల్లో గుట్టలు ఉన్నాయి. 12 ఎకరాలు ఉన్న లింగమయ్య గుట్ట తప్ప మిగతా అన్నీ కాజేశారు. ఈ కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డి వాటా ఎంత? పొంగులేటి కుటుంబంపై అధికారులు చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో వ్యాఖ్యలకు సీఎం కట్టుబడి ఉంటే చర్యలు తీసుకోవాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## జనసంఘ్ నుంచి జాతీయ ఉద్యమం వరకు..

# బీజేపీ 46 ఏళ్ల ప్రయాణం



బీజేపీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని జాతీయత, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిబద్ధత అనే విలువలతో ముందుకు సాగే ఒక మహత్తర జాతీయ ఉద్యమం అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్? రావు పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త దేశం ముందు - పార్టీ తర్వాత - స్వయం చివర అనే భావంతో, పార్టీ సిద్ధాంతాలను మరింతగా ప్రజలకు చేరువ చేసే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆదివారం తమ నివాసం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 45 సంవత్సరాలు పూర్తి చేసుకుని 46 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న పార్టీ ఈ రోజు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా నిలవడం మనందరికీ గర్వకారణంగా ఉందన్నారు. ఒకప్పుడు జనసంఘ్‌గా ప్రారంభమైన ఈ ప్రయాణం, అనంతరం 1980లో ముంబైలో అటల్ బిహారీ వాజపేయి అధ్యక్షతన భారతీయ జనతా పార్టీగా రూపుదిద్దుకుని, తన సిద్ధాంత బలం, క్రమశిక్షణ గల కార్యకర్తల శ్రమ, జాతీయ సేవ పట్ల అచంచల నిబద్ధతతో అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందన్నారు. విశాలమైన సభ్యత్వ బలం, దాదాపు 21 రాష్ట్రాల్లో ప్రభుత్వాలతో భారతీయ రాజకీయాల్లో

- మిగతా 2లో...

# ఫ్లిప్‌కార్ట్ నుంచి ఫోన్‌పే వరకు... స్టార్టప్ మాఫియా సక్సెస్ స్టోరీ




**హైదరాబాద్ :** ప్రపంచ కార్పొరేట్ రంగంలో వేగంగా ఎదుగుతున్న ఆసక్తికరమైన ధోరణి 'స్టార్టప్ మాఫియా'. పేరు వింటే అండర్‌వర్ల్డ్ గ్యాంగ్‌లా అనిపించినా.. ఇది పూర్తిగా విభిన్నం. ఒకే సంస్థలో కలిసి పనిచేసిన ఉద్యోగులు, ఆ సంస్థను వదిలి తర్వాత తమ స్వంత స్టార్టప్స్‌ను ప్రారంభించి పరస్పరం సహకరించుకునే నెట్‌వర్క్‌కే ఈ పేరు. ఐడియాలే ఆయుధాలుగా నెట్‌వర్క్‌లే బలంగా ఇవి కార్పొరేట్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

భారతదేశంలో ఈ సంస్కృతికి బీజం వేసింది ఫ్లిప్‌కార్ట్. అమెజాన్‌లో పనిచేసిన సచిన్ బన్సల్, బిన్నీ బన్సల్ స్థాపించిన ఈ సంస్థ కేవలం ఈ-కామర్స్ దిగ్గజంగానే కాకుండా 'స్టార్టప్ స్కూల్'గా మారింది. ఇక్కడ పనిచేసిన అనేక మంది ఉద్యోగులు తర్వాత మింత్రా, ఉడాన్, గ్రో వంటి ప్రముఖ సంస్థలను ప్రారంభించారు. ఫ్లిప్‌కార్ట్ పూర్వ ఉద్యోగులను 'ఫ్లిప్‌స్టర్స్'గా పిలుస్తారు.అలాగే పేటీఎం కూడా స్టార్టప్ మాఫియాలో కీలక పాత్ర పోషించింది. విజయ్ శేఖర్ శర్మ నేతృత్వంలోని ఈ సంస్థ నుంచి వచ్చిన మాజీ ఉద్యోగులు ఇండియాగోల్డ్, పాకెట్ ఎఫ్ఎం వంటి సంస్థలను స్థాపించారు. ఇదే ధోరణి ఓయో, ఓలా, జొమాటో, స్విగ్గీ వంటి కంపెనీల్లోనూ కనిపించింది. ఈ సంస్థల నుంచి వచ్చిన వందలాది మంది కొత్త వ్యాపారాలకు శ్రీకారం చుట్టారు.ఇటీవల కాలంలో 'స్టార్టప్ మాఫియా 3.0' మరింత వేగంగా విస్తరిస్తోంది. రేజర్‌పే, మీషో, క్రెడ్, ఫోన్‌పే వంటి సంస్థలు ఉద్యోగులను ఆంత్రప్రెన్యూర్లుగా తయారు చేసే ఫ్యాక్టరీలుగా మారాయి. ఓపెన్ కల్చర్, స్వేచ్ఛా ఆలోచనలు, విఫలతలను అంగీకరించే ధోరణి.. ఇవి ఈ సంస్థల ప్రధాన బలాలు. ఫలితంగా, ఉద్యోగులు తక్కువ కాలంలోనే తమ స్వంత సంస్థలను ప్రారంభిస్తున్నారు.

అమెరికాలో ఈ సంస్కృతి 'పేపాల్ మాఫియా'తో మొదలైంది. పీటర్ థీల్, ఎలన్ మస్క్ వంటి ప్రముఖులు ఇందులో భాగమయ్యారు. వారి నుంచి ప్రేరణ పొందిన గూగుల్, ఫేస్‌బుక్, ఆపిల్ వంటి కంపెనీలూ తమ తమ మాఫియాలను నిర్మించుకున్నాయి.స్టార్టప్ మాఫియా విజయానికి ప్రధాన కారణం పరస్పర సహకారం. మాజీ సహచరులు ఇన్వెస్టర్లు, మెంటర్లు, భాగస్వాములుగా మారి కొత్త వ్యాపారాలను ముందుకు తీసుకెళ్తారు. అయితే ప్రతి ప్రయాణం విజయవంతం అవుతుందనే గ్యారెంటీ లేదు. మార్కెట్ పోటీ, వ్యూహపరమైన తప్పిదాలు కొందరికి చేదు అనుభవాలనూ మిగులుస్తాయి.అయినా సరే స్టార్టప్ మాఫియా సంస్కృతి యువతలో ఆంత్రప్రెన్యూర్షిప్‌కు కొత్త ఊపునిస్తోంది. ఉద్యోగం కంటే యజమాన్యం వైపు అడుగులు వేయాలనుకునే వారికి ఇది ప్రేరణగా నిలుస్తోంది. భవిష్యత్తులో ఈ నెట్‌వర్క్‌లు మరింత విస్తరించి, కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడం ఖాయం.

# ప్రతి దళిత కుటుంబానికి గౌరవం.. ప్రతి యువకుడికి అవకాశం: మంత్రి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్ :** భారతదేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు కేవలం స్మరణకే పరిమితం కాకుండా, దళిత ఆత్మగౌరవ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే సంకల్ప దినంగా మార్చాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. సమానత్వం, న్యాయం, స్వాభిమానం అనే మహనీయుడు చూపిన మార్గంలో తెలంగాణ ప్రభుత్వం నడుస్తోందని ఆయన స్పష్టం చేశారు. జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, అధికారంలో ఉన్నప్పటికీ అణగారిన వర్గాల పక్షాన నిలబడిన అరుదైన నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని ఆయన కొనియాడారు. దళితులు, పేద, అణగారిన వర్గాలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించడం దళితుల పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పరిసరాల్లో రూ.100 కోట్లతో 10 అంతస్తుల అంబేద్కర్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. కాచిగూడలోని నింబోలిఅడ్డలో రూ. 30 కోట్లతో బాబు జగ్జీవన్ రామ్ భవన్ ను నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు.

### దళిత విద్యార్థులకు మద్దతు

దళిత విద్యార్థులకు ఉన్నత విద్యలో బలమైన మద్దతు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1, 2, 3, 4 వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను త్వరలో ప్రారంభించనున్నట్లుగా మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రకటించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పన పై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. గ్రామ స్థాయిలో దళితుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తూ, మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రతి దళిత కుటుంబానికి గౌరవం, ప్రతి యువకుడికి అవకాశం కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగ్జీవన్ రామ్ కలల భారతాన్ని తెలంగాణలో సాకారం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, మంత్రులు వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ, ఎంపీలు మల్లు రవి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కౌన్సిల్ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామెల్, నాగరాజు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొ. కాసీం, జేబీ రాజు, మేడి పాపయ్య, ఉత్సవ కమిటీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు బాబు జగ్జీవన్ రామ్ కు ఘనంగా నివాళులర్పించారు.

# జనసంఘ్ నుంచి జాతీయ ఉద్యమం వరకు.. బీజేపీ 46 ఏళ్ల ప్రయాణం

- మొదటి పేజి తరువాయి

శక్తివంతమైన శక్తిగా అవతరించిందన్నారు. ఈ అభివృద్ధి పార్టీపై, దాని నాయకత్వంపై దేశ ప్రజలు ఉంచిన విశ్వాసం, నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ సంస్థ మాత్రమే కాదని, దేశ భవిష్యత్తును మలిచే ఒక శక్తివంతమైన జాతీయ ఉద్యమంగా నిలిచిందన్నారు.

### భారత్‌కు నిజమైన ఆర్థిక మార్పు

వాజపేయి, మోడీ దేశ ప్రధానమంత్రులైన తర్వాతనే భారత్ నిజమైన ఆర్థిక మార్పును, అభివృద్ధి కొత్త యుగాన్ని చూడడం ప్రారంభించింది. వారి నాయకత్వం దేశానికి కొత్త దిశను చూపి, అభివృద్ధిని వేగవంతం చేసి, మరింత బలమైన, ఆత్మనిర్భరమైన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి పునాది వేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ భారత్ అభివృద్ధిని నిజమైన అర్థంలో ఆలోచించలేదని, అవినీతినే పాలనగా మార్చుకుంది. దీనికి విరుద్ధంగా మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం ఒక్క అవినీతి మచ్చ కూడా లేకుండా ప్రజలకు అవినీతి రహిత పాలనను అందిస్తోందని అన్నారు.

### పార్టీ బలం కార్యకర్తల్లో ఉంది

పార్టీ బలం కేవలం నాయకత్వంలోనే కాదని, క్రమశిక్షణతో, అంకితభావంతో, అనేక సవాళ్లు, కష్టాలను ఎదుర్కొంటూ నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తల్లో ఉందని చెప్పారు. అలాంటి కార్యకర్తల పట్ల ఈ పార్టీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని, పార్టీ ఈ స్థాయిలో నిలవడానికి వారి కష్టం, త్యాగం, అచంచల నిబద్ధతే కారణమని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలను, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగాలను, కాశ్మీర్ కోసం ఆయన చేసిన త్యాగాన్ని మనం స్మరించుకుని ప్రేరణ పొందాలన్నారు. ద

ఈ మహనీయుల ఆలోచనలు, త్యాగాలే భారతీయ జనతా పార్టీ సిద్ధాంత పునాదులు.. అవి ప్రతి కార్యక్రమంలో, ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. తెలంగాణలో మరింత అంకితభావంతో పనిచేసి పార్టీని అధికార దిశగా తీసుకెళ్లాలని కోరారు.

# కారుణ్య నియామకం తెలంగాణ హై కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు..

ప్రభుత్వ ఉద్యోగి మరణించినప్పుడు ఆ కుటుంబానికి అండగా నిలవాల్సిన 'కారుణ్య నియామకం' విషయంలో తెలంగాణ హైకోర్టు స్పష్టమైన సూచనలు చేసింది. చాలా మంది ఏళ్ల తరబడి దరఖాస్తులు పెండింగ్‌లో పెడుతూ, పదేళ్ల తర్వాత కూడా ఉద్యోగం కావాలని కోరుతుండడంతో న్యాయస్థానం ఈ విషయంలో స్పష్టమైన గడువు, నిబంధనలను ఖరారు చేసింది. ఉద్యోగి మరణించిన ఏడాదిలోపే దరఖాస్తు చేసుకోవాలని, లేదంటే ప్రభుత్వం ఆ విన్నపాన్ని ఆమోదించాల్సిన అవసరం లేదని హైకోర్టు తేల్చి చెప్పింది.



### ఏడాది డెడ్ లైన్

కారుణ్య నియామకం అనేది ఒక హక్కు కాదు, అది కేవలం ఒక 'ఆర్థిక వెసులుబాటు' మాత్రమేనని కోర్టు గుర్తు చేసింది. ఉద్యోగి మరణించిన వెంటనే ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడమే దీని ముఖ్య ఉద్దేశం. అందుకే మరణించిన ఏడాది కాలంలోపే సంబంధిత వారసులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఏడాది దాటిన తర్వాత చేసే దరఖాస్తులను ప్రభుత్వం తిరస్కరించవచ్చు. పదేళ్ల తర్వాత లేదంటే పిల్లలు పెద్దయ్యాక ఉద్యోగం అడగడం కారుణ్య నియామక నిబంధనలకు విరుద్ధమని ధర్మాసనం స్పష్టం చేసింది.

### ఆర్థిక స్థితిగతులే ప్రామాణికం

ఉద్యోగి కుటుంబం నిజంగా సంక్షోభంలో ఉంటేనే ఈ నియామకం వర్తిస్తుంది. మరణించిన ఉద్యోగి భార్య లేదంటే భర్త ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటే, ఆ కుటుంబంలోని పిల్లలకు లేదా ఇతర సభ్యులకు కారుణ్య నియామకం వర్తించదని ధర్మాసనం స్పష్టం చేసింది. సదరు కుటుంబం ఆర్థికంగా నిలకడగా ఉన్నా, ఇతర ఆదాయ మార్గాలు ఉన్నా ఈ కోటా కింద ఉద్యోగం ఇవ్వాల్సిన అవసరం లేదని న్యాయస్థానం వివరించింది. ఈ నియామకం కేవలం ఆ కుటుంబం ఆకలితో అలమటించకుండా చూసేందుకే తప్ప, వారసత్వంగా వచ్చే ఉద్యోగం కాదని కోర్టు ఘాటైన వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన వివిధ తీర్పులకు అనుగుణంగా ఉంది. ఆర్టికల్ 14, 16 సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగాలు నోటిఫికేషన్ ద్వారా, మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలి. కారుణ్య నియామకం అనేది వీటికి ఒక మినహాయింపు మాత్రమే. ఈ మినహాయింపును దుర్వినియోగం చేయకూడదని, అర్హత లేని వారికి ఈ ఉద్యోగాలు ఇస్తే అది రాజ్యాంగ విరుద్ధమని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### కుటుంబాలపై ప్రభావం

ఈ తీర్పు వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా విషాదం జరిగినప్పుడు బాధలో ఉండి దరఖాస్తు వాయిదా వేయకూడదు. నిర్ణీత గడువులోగా పత్రాలను సమర్పించాలి. కుటుంబ సభ్యులందరి అంగీకారంతో, సరైన వారసుడిని ఎంపిక చేసుకొని దరఖాస్తు చేసుకోవడం ద్వారా

అనవసరమైన కోర్టు వివాదాలను నివారించవచ్చు.కారుణ్య నియామకం అనేది ఒక సామాజిక భద్రతా కవచం. హైకోర్టు తీర్పు ద్వారా అర్హులైన వారికే, అది కూడా సకాలంలో ఉద్యోగం అందేలా చూసే అవకాశం కలిగింది. ప్రభుత్వ ఉద్యోగం లేని, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ తీర్పు ఒక రకమైన రక్షణ కల్పిస్తుంది. అనర్హులు ఈ పథకాన్ని వాడుకోకుండా అడ్డుకట్ట వేయడంలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుంది.

# అమెరికా సైనిక కదలికలపై.. ఆ దేశం నిఘా.. ఇరాన్ కు చేరవేసేది ఆ దేశమేనా?

ఒకవైపు ప్రపంచ దేశాల ముందు శాంతిని బోధిస్తున్నట్లు కనిపిస్తున్నా, మరోవైపు చైనా తన ఏఐ (ఏఐ×), సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అమెరికా సైన్యంపై నిఘా పెట్టడం అంతర్జాతీయ భద్రతకు కొత్త సవాలుగా మారింది. ఏప్రిల్, 2026 నాటి తాజా నివేదికల ప్రకారం, పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం (ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ) తీవ్రతరమైన వేళ, చైనా టెక్ కంపెనీలు అమెరికా సైనిక కదలికలను ఖచ్చితత్వంతో ట్రాక్ చేస్తున్నాయి.



### బహిరంగ సమాచారమే ఆయుధం

చైనా కంపెనీలు ఎటువంటి రహస్య గూఢచారి వ్యవస్థలను కాకుండా, అందుబాటులోని సమాచారాన్నే ఏఐ ద్వారా విశ్లేషిస్తున్నాయి. ఉపగ్రహ చిత్రాలు, ఫ్లైట్ ట్రాకర్లు, నౌకా రవాణా సమాచారాన్ని కృత్రిమ మేధస్సుతో అనుసంధానం చేస్తున్నారు. చైనాకు చెందిన 'జిలిన్' శాటిలైట్ కన్సల్టేషన్ నుంచి భారీగా చిత్రాలను కొనుగోలు చేస్తూ, అమెరికా విమానవాహక నౌకలు, యుద్ధ విమానాలు ఉండే స్థానాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నవారు. వాటి గమన తీరును సున్నితంగా పర్యవేక్షిస్తున్నారు. ఏఐ కళ్ల ముందు అదృశ్య విమానాలకు కూడా చోటు లేదు' అని చైనా కంపెనీలు పేర్కొనడం గమనార్హం. అమెరికాకు చెందిన బీ-2 స్టీల్త్ బాంబర్ల మధ్య జరిగిన కమ్యూనికేషన్ కూడా పసిగట్టామని వారు చెప్తుండడం అమెరికాకు కలవరం కలిగిస్తోంది.

### ఇరాన్ కు రహస్య సాయం

బహిరంగంగా తటస్థంగా ఉంటున్నట్లు నటిస్తున్నా, చైనా తన మిత్రదేశమైన ఇరాన్ కు కీలక సమాచారాన్ని చేరవేస్తోంది. అమెరికా సైనిక స్థావరాలు, ఆయుధాల మోహరింపు గురించి చైనా కంపెనీలు సేకరించిన సమాచారం ఇరాన్ తన రక్షణను పటిష్టం చేసుకోవడానికి ఉపయోగపడుతోంది. కేవలం సమాచారమే కాకుండా, మిస్సైల్ విడిభాగాలు, చిప్ మేకింగ్ టూల్స్, రాకెట్ ఇంధనానికి ఉపయోగించే 'సోడియం పర్క్లోరేట్'ను కూడా చైనా ఇరాన్ కు సరఫరా చేస్తున్నట్లు అంతర్జాతీయ సమాజం ఎదుట గుసగుసలాడుతుంది.

### ముప్పు ముంగిట ప్రపంచం!

చైనా ప్రైవేట్ కంపెనీలు ఇలాంటి నిఘా టూల్స్‌ను బహిరంగంగా మార్కెటింగ్ చేయడంపై వాషింగ్టన్ స్పందించింది. చైనాలోని ప్రైవేట్ కంపెనీలు ఆ దేశ సైన్యంతో లోతైన సంబంధాలు కలిగి ఉండటమే ఈ ముప్పునకు కారణం. ఒకప్పుడు ప్రభుత్వాలకు మాత్రమే సాధ్యమైన ఈ స్థాయి నిఘా, ఇప్పుడు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం వల్ల భవిష్యత్తులో సైనిక కార్యకలాపాలను రహస్యంగా ఉంచడం అసాధ్యంగా మారనుంది.

### గూఢచర్యానికి కొత్త చిరునామా!

గతంలో ఒక దేశపు సైనిక కదలికలను తెలుసుకోవాలంటే గూఢచారులు లేదంటే అత్యంత ఖరీదైన సైనిక ఉపగ్రహాలు అవసరమయ్యేవి. కానీ ఇప్పుడు ఫ్లైట్ రాడార్ వంటి పబ్లిక్ యాప్స్, వాణిజ్య ఉపగ్రహాల డేటాను ఏఐ ద్వారా విశ్లేషిస్తున్నాయి. దీనివల్ల అమెరికాకు చెందిన అత్యంత రహస్యమైన 'స్టీల్త్' యుద్ధ విమానాలు ఎక్కడ ఉన్నాయి.., విమానవాహక నౌకలు ఏ దిశలో కదులుతున్నాయి.., అనే సమాచారం చిటికెలో చైనా సైన్యానికి చేరుతోంది. ప్రైవేట్ రంగంలో జియోస్పేషియల్ విశ్లేషణ సామర్థ్యం పెరగడం వల్ల భవిష్యత్తులో ఏ దేశమూ తన సైనిక వ్యూహాలను పూర్తిగా రహస్యంగా ఉంచడం అసాధ్యంగా మారనుంది.

### ప్రపంచ దేశాలకు హెచ్చరిక

ఈ ఏఐ నిఘా టూల్స్‌ను చైనా కంపెనీలు బహిరంగంగా మార్కెటింగ్ చేయడం వల్ల కేవలం అమెరికాకే కాకుండా, భారత్ వంటి ఇతర దేశాలకు ముప్పు పొంచి ఉంది. ఏఐ రాకతో ఒకప్పుడు కేవలం ప్రభుత్వాలకే పరిమితమైన నిఘా సామర్థ్యం ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు అందుబాటులోకి వచ్చింది. ఇది ఉగ్రవాద సంస్థలు లేదంటే శత్రు దేశాల చేతుల్లోకి వెళ్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియా యుద్ధంలో ఇరాన్‌కు ఇలాంటి సాంకేతిక సాయం అందడం వల్ల యుద్ధ గమనం మారే అవకాశం ఉందని, ఈ డిజిటల్ యుద్ధ తంత్రాన్ని ఎదుర్కోవడానికి ప్రపంచ దేశాలు కొత్త రక్షణ కవచాలను నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది.ప్రస్తుత పరిస్థితుల్లో యుద్ధం కేవలం సరిహద్దుల్లోనే కాదు, డేటా మరియు ఏఐ ల్యాబ్స్‌లో కూడా జరుగుతోంది. చైనా చేస్తున్న ఈ ఏఐ నిఘా వల్ల అమెరికా తన సైనిక వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఓపెన్ సోర్స్ సమాచారాన్ని ఏఐ ఎంత శక్తివంతమైన ఆయుధంగా మార్చగలదో ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇది కేవలం అమెరికాకే కాదు, రేపు భారత్ వంటి ఇతర దేశాల భద్రతపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# బయ్యారం ప్రెస్ క్లబ్ అధ్యక్ష,ఉపాధ్యక్షులుగా సంకపల్లి సుమన్ రెడ్డి,బానోత్ స్వామి ఏకగ్రీవం.



**బయ్యారం,ప్రభాత వార్త,ఏప్రిల్ 5.**బయ్యారం ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల కేంద్రంలో రిజిస్ట్రేషన్ 348/2021 ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్ నాయిని ఇంద్రారెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.మూడోసారి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా (వార్త రిపోర్టర్) సంకపల్లి సుమన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా దారావత్ వెంకట్రామ్,ఉపాధ్యక్షుడిగా బానోత్ స్వామి,సహాయ కార్యదర్శిగా చామర్తి వినయ్ కుమార్,కోశాధికారిగా భూక్యా మంగుతో పాటు గౌరవ సలహాదారులుగా షేక్ జీలాని,నాయిని ఇంద్రారెడ్డి ని సభ్యులంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనంతరం నూతన ప్రెస్ క్లబ్ కమిటిని షేక్ యుసాఫ్ పాషా,రామసహాయం ప్రకాష్ రెడ్డి,కేస మునీందర్,పాముల విద్యాసాగర్,సపవత్ సంతోష్,కపిల్ చౌదరి నీలారపు సంపత్ యాదవ్ లు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సుమన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని విధాలుగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని అన్నారు. తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న క్లబ్ సభ్యులందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మమ్ములను గుర్తించి మా సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె.



**న్యూస్ ఇండియా తెలుగు ఏప్రిల్ 5. మహబూబాబాద్ జిల్లా బయ్యారం:...**విద్యుత్ శాఖలో ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్నా వారికీ తగినంత గుర్తింపు లేదని విద్యుత్ శాఖలో ఆర్టిజన్స్ కు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ తో కూడినటువంటి కన్వర్షన్ వర్తింప చేయాలని అలాగే అన్మాడ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి విలీనం చేసుకోవాలని స్పాట్ బిల్డర్స్ ని 30 రోజుల పని దినముల వేతనం కల్పించాలని అలాగే వివిధ కారణాలవల్ల ఆర్టిజన్స్ కాకుండా మిగిలిన పోయిన వారిని ఆర్టిజన్స్ గా గుర్తించాలని గత 26,30తారీకుల రోజున డివిజన్ ఆఫీసు ముందు ధర్నా మరియు ఏప్రిల్ 2 తేదీన ధర్నా వంట వార్పు కార్యక్రమాలు చేపట్టారు. అయినా యాజమాన్యం ప్రభుత్వం స్పందించలేదు కావున ఏప్రిల్ 7 తారీఖున ఎస్పిడిసియల్ ఆఫీస్ ఆవరణలో ధర్నా కార్యక్రమం

8 తారీకు నుండి సమ్మెలో పాల్గొనేందుకు వాల్ పోస్టర్ వివిధ కార్యాలయల వద్ద అతికించారు. కావున విద్యుత్ కార్మిక లోకం 7 తారీఖున ఎస్పిడిసియల్ ఆఫీస్ ధర్నా, 8 తారీకు నుండి సమ్మె లో అధిక సంఖ్యలో పాల్గొనాలని టీవిఏఈ జేఏసీ జిల్లా చైర్మన్ జిల్లోజు అశోక్ డివిజన్ చైర్మన్ డివిజన్ చైర్మన్ ఎండి మసూద్ పాషా

డివిజన్ కన్వీనర్ నీరు వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు వాసం సారంగపాణి పిలుపునిచ్చారు.వీరు వెంట సురేష్,ఏలేందర్ తదితరులు ఉన్నారు.ద

# డా. బాబు జగ్జీవన్ రామ్ గారికి భారతరత్న ఇవ్వాలి.



**న్యూస్ ఇండియా ప్రతినిధి హనుమకొండ జిల్లా**

డా..గోవింద్ నరేష్ మాదిగ

ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు

వివరణ: ఈరోజు కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య ప్రాంగణం వద్ద మీఖీ కేయూ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ గారి 119వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా..గోవింద్ నరేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి మాదిగలు హాజరై మాట్లాడుతూ భారత ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర సమరయోధుడు, ఆధునిక భారతదేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన రాజకీయ దురంధరుడు, సుదీర్ఘకాలం పార్లమెంట్లో సభ్యుడిగా దేశ ప్రజలకు విశేషమైన సేవలు అందించిన యోధులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారికి భారతరత్నం కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ, మీఖీ సీనియర్ నాయకులు మంద భాస్కర్ మాదిగ, డా..వడ్డేపల్లి మధుకర్ మాదిగ మీఖీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముఖేష్ మాదిగ , మారపల్లి రాణా ప్రతాప్ మాదిగ,తిలక్ మాదిగ , కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకులు డా.సత్య జూల, డా. నాగేశ్వరరావు గారు తదితరులు పాల్గొన్నారు..

# కార్మికుల వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమించాలి.



✸ షేక్.మీరా టీపీటీఫ్ మండల మాజీ అధ్యక్షులు.

**న్యూస్ ఇండియా తెలుగు ఏప్రిల్ 5. మహబూబాబాద్ జిల్లా బయ్యారం:....**మండల కేంద్రంలో గల విజయలక్ష్మి టైల్స్ ఫ్యాక్టరీలో ఐఎఫ్ టీయు జిల్లా జనరల్ కౌన్సిల్ యాకయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు.ఈ కౌన్సిల్ లో టీపీటీఫ్ బయ్యారం మండల మాజీ అధ్యక్షులు షేక్.మీరా పాల్గొని మాట్లాడుతూ నేడు దేశంలో కార్మికుల పరిస్థితి చాలా దీనమైన స్థితిలో ఉన్నదని,దీనికి కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం అని ఆయన అన్నారు.ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న 44 కార్మిక చట్టాలలో 15కార్మిక చట్టాలను రద్దు చేసి 29కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా సవరణ చేసిందని,ఈ కార్మిక చట్టాల సవరణ వల్ల దేశంలోని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 40 కోట్లకు పైగా ఉన్న కార్మికులకు తీవ్రనష్టం కలిగించే విధంగా ఉన్నాయని అన్నారు.కార్మిక వర్గ ప్రయోజనాలు విస్మరించిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారస్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరణ చేసిందని అన్నారు.దేశంలోని యావత్ కార్మిక వర్గం కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని,అలాగే కార్మికులకు తీవ్రనష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు ఉద్యమించాలని అన్నారు.

ఎందరో కార్మికుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరణ చేయడం దుర్మార్గమైనదని,ఎనిమిది గంటల పనిదినాన్ని పన్నెండు గంటల పనిదినంగా కేంద్ర ప్రభుత్వం చేసిందని అన్నారు.దేశంలో కార్మిక వర్గం చేసే పోరాటాలకు టీపీటీఫ్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు.ఐఫ్ టీయు జిల్లా నూతన కార్యవర్గాన్ని జనరల్ కౌన్సిల్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.యాకయ్య (అధ్యక్షులు)లింగ్యా (ఉపాధ్యక్షులు)

కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి (ప్రధానకార్యదర్శి)

సావడి దుర్గాప్రసాద్ (సహాయ కార్యదర్శి)

ఇర్ప శ్రీధర్ (కోశాధికారి)తదితరులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇఫ్ట్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ రాంసింగ్,ప్రధాన కార్యదర్శి షేక్.మదార్.సనప పొమ్మయ్య. కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి,మూతి రాంబాబు,శ్రీధర్,పెద్ద మౌలాన,లక్ష్మీనారాయణ,బొడ్డుపల్లి వెంకన్న,ఆదినారాయణ,రాంబాబు,కోటేష్,శంకర్,చుక మ్మ,శ్రీకాంత్,అప్పన్న,అలివేలు,పాషా,బూలి,లింగాచా రి తదితరులు పాల్గొన్నారు.

# తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ గారి గజ్వేల్ క్యాంపు కార్యాలయంపై దాడిని ఖండిస్తు



**న్యూస్ ఇండియా హనుమకొండ జిల్లా ప్రతినిధి**

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ గారు మాట్లాడుతూ...

అధికార పక్షంమే ప్రభుత్వ కార్యాలయాలపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణిస్తున్నాం

తెలంగాణలో పక్క రాష్ట్ర తరహా ఫ్యాక్షన్ రాజకీయాలకు, దాడులకు కాంగ్రెస్ పాల్పడుతోంది, తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ సమయంలో సైతం ఈ తరహా దాడులను చూశాం... నాడు సరైన రీతిలో సమాధానం చెప్పాం. రానున్న రోజుల్లో సైతం సరైన బుద్ధి చెబుతాం.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తుంటే... దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్ ఇలాంటి దాడులకు తెగబడుతోంది

హామీల అమలు మరచి దాడులకు తెగబడుతూ... డైవర్షన్, కరప్షన్ పాలిటిక్స్ చేస్తోంది

శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ...

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సీఎం అనే స్థాయిని మర్చిపోయి కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తున్నారు

తెలంగాణ భవిష్యత్ ని అగమ్యగోచరంగా చేస్తున్న అర్భకుడు రేవంత్ రెడ్డి

రేవంత్ రెడ్డి కేరళలో పినరై విజయన్ గారిపైన మాట్లాడుతున్నాడు.. జాతీయ రాజకీయాల్లో ముఖ్య నేతగా ఉన్న విజయన్ గారిపై మాట్లాడే స్థాయి రేవంత్ కి లేదు

కేరళలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నేను ఫ్లైట్ ఏర్పాటు చేస్తాను.., మా తెలంగాణా కి వచ్చి 6 గ్యారెంటీల అమలు చూడమంటున్నాడు... రేవంత్ రెడ్డి 6 గ్యారెంటీలు అమలు చేశానని చూపిస్తే నేను హనుమకొండ చౌరస్తాలో ఉరి వేసుకుంటాను

శాసన మండలిలో... గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ మీద చర్చ, పద్దులపై చర్చలు అత్యంత ప్రధాన అంశాలు..ఆ అంశాల మీద చర్చ సమయంలో రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్ళాడు

శాసనసభ, శాసనమండలిలో సభ్యుల అడిగిన ప్రశ్నలకు సమాధానాలే కరువయ్యాయి.

సభను సక్రమంగా నిర్వహించలేదు

కాళేశ్వరం ప్రాజెక్టు కట్టక ముందు, కట్టిన తర్వాత రాష్ట్రంలో పంటల దిగుబడి ఎలా వుందో అందరికీ తెలుసు... కానీ కేంద్ర మంత్రి పార్లమెంటు లో మాట్లాడుతూ కాళేశ్వరం, లక్ష కోట్లు నీళ్ల పాలు అయ్యాయని, నెగటివ్ కామెంట్స్ చేసాడు... ఆ కేంద్ర మంత్రికి తన శాఖపై అవగాహన లేదు

కనీసం అవగాహన లేకుండా మాట్లాడాడు. 2014కు ముందు తెలంగాణ వరి ఉత్పత్తిలో ఎక్కడ ఉండే, 2023 నాటికి దేశంలోనే నంబర్ 1 అయ్యింది కారణం కాళేశ్వరం కాదా..

ఇప్పుడు తెలంగాణ రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నవి నిజం కాదా..

నిన్న గజ్వేల్ క్యాంపు కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాము.. రాహుల్ గాంధీ ఆఫీస్ లో మోడీ ఫోటో పెడుతున్నారా అని కాంగ్రెస్ వారిని అడుగుతున్నాను

కడియం శ్రీ హరి ఏ పార్టీ యో, ఘన్పూర్ ప్రజల చేత రెఫరెండం పెట్టించాలి... శ్రీహరి చిల్లరగా వ్యవహరిస్తున్నారు

మిగిత పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యే విషయంలో ఇలానే రెఫరెండం నిర్వహించాలనేది నా అభిప్రాయం

మేడారం లో గాయపడి గార్డియన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నయువన్ అనే చిన్నారి ని మేము నిన్న పరామర్శించాము.. సీఎం తో సహా అందరూ మేడారం లో వాటాల కోసం మాత్రమే క్యాంపు పెట్టారు

2 టన్నుల రాయి యువన్ కాలుపై పడడడం వల్ల అతని కాలుని తీసివేశారు... నాసిరకం పనులు మేడారంలో జరిగాయి.. తక్షణం ఈ ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు...ఇది ప్రజా పీడన లా ఉన్నది

మొగళ్లపల్లి మండలం కొక్కిశాలలో క్రేను బావిలో పడి ముగ్గురు చనిపోయారు... ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఒక్కరు కూడా బాధిత కుటుంబాలను పరామర్శించలేదు... భూగర్భ జలాలు అడుగంటడం వల్ల వారు పూడిక తీత పనులు చేశారు కారణం కాళేశ్వరాన్ని ఎండగొట్టడమే... ఇప్పుడు కరెంట్ కోతలు, రైతుబంధు ఎగవేతలు జరుగుతున్నాయి.

రాష్ట్రంలో అనేక హాస్టల్లలో కల్తీ భోజనము వల్ల విద్యార్థుల ఆరోగ్యం చెడిపోతుంది, గతంలో సీఎం మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని హాస్టల్ల నిర్వహణ బాధ్యత తీసుకోమన్నారు. రెండు రోజులు హడావిడి చేశారు. కానీ హాస్టల్లలో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్న ఘటనలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి.

ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు మాట్లాడుతూ...

రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగాయి.

రైతులకు ఎరువులు దొరకడం లేదు, ఫలితంగా దిగుమతి తగ్గి, అప్పుల పాలు అవుతున్నారు.

రైతుబంధు సైతం ఇప్పటి వరకు ఇవ్వలేదు

చేనేత కార్మికులు సైతం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

కేసీఆర్ గారి ప్రభుత్వంలో చేనేత కార్మికులకు సబ్సిడీలు ఇచ్చారు, బతుకమ్మ చీరలు, విద్యార్థుల దుస్తుల కాంట్రాక్టులు చేనేత కార్మికులకు ఇవ్వగా... ఈ ప్రభుత్వం మాత్రం కాంట్రాక్టర్లకు కమిషన్లు తీసుకొని అప్పజెప్పి, నేతలన్నల పొట్టకొడుతోంది.

విలేకరుల సమావేశానికి ముందు. .. భారత ఉప ప్రధాని, భారత రత్న, బాబు జగ్జీవన్ రామ్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు కార్యక్రమంలో కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, ఏలిమి సతీష్, పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపల్లి జనార్ధన్ గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ముదిరాజ్, సీనియర్ నాయకులు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నయీమొద్దీన్, సల్వాజి రవీందర్ రావు, పార్టీ డివిజన్ అధ్యక్షులు కొడకండ్ల సదాంత్, పున్నం చందర్, నాయకులు పానుగంటి శ్రీధర్, జానకి రాములు, రామ్మూర్తి, సుదర్శన్, సారిక, సౌరం రఘు, గంద్రకోట రాకేష్ యాదవ్, దొమకుంట్ల రాజ్‌కుమార్, పుల్లయ్య, మూటిక రాజు యాదవ్, సురాసి మహేష్, సంపతి రఘు, నవీన్, విజయ్ రెడ్డి, తక్కళ్లపల్లి వినీల్ రావు, మంద సృజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు..



**పాలకుర్తి ఏప్రిల్ 05 (న్యూస్ ఇండియా ప్రతినిధి )**పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి గారు శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారిని ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, శ్రేయస్సు మరియు ప్రాంత అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు..

ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారిని అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతించి, వేదమంత్రాల నాదాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు..

# ఘనంగా డా.జగ్జివన్ రావు జన్మదిన వేడుకలు



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మార్చి 05.అడ్డగూడూర్ మండల రిపోర్టర్.**

ఈరోజు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ జగ్జీవన్ రావు 119 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది జగ్జీవరావు చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సూరారం రాజు సిపి మడ్డకుడు మండల కార్యదర్శి బుర్ర అనిల్ కుమార్ మాట్లాడుతూ అన్నగారిన వర్గాల ఆశ జ్యోతి పేద ప్రజల పెల్లిది ప్రముఖ రాజకీయవేత కేంద్ర మాజీ మంత్రివర్యులు జగ్జీవన్ రావు గారి జయంతి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం అని కొనియాడారు దళితుల అభ్యున్నతి కోసం ప్రాణ త్యాగాలను సైతం లెక్కచేయకుండా అణగారిన వర్గాల కోసం శ్రమించి విద్య రాజకీయపరంగా అనేక అవకాశాలు కల్పించుకొని ప్రజల కోసం కొట్లాడిన ఘనత జగ్జివన్ రావు ది అన్ని అన్నారు. పార్టీలకతీతంగా రాజకీయాల కచ్చితంగా ఏప్రిల్ నెల మొత్తం మహనీయుల మాసం కాబట్టి అందరూ మహనీయుల జయంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునివడం జరిగింది.

ఈ కార్యక్రమంలో యం. ఆర్ పి యస్ నాయకులు పనుమటి సతీష్,బాలెంల నరేష్,డప్పు మల్లేష్,బాలెంల మధు,అఖిల్,బాలెంల బాబు,మందుల అవిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్వోత్తంరెడ్డి జన్మదిన వేడుకలు



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మార్చి 05.అడ్డగూడూర్ మండల రిపోర్టర్.** అడ్డగూడూరు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు ఏఐసీసీ సభ్యులు సర్వోతం రెడ్డి పుట్టినరోజు వేడుకలు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గూడెపు నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కడారి రమేష్, గూడెపు పాండు, మారిశెట్టి మల్లేష్, ఏనుగుతుల నాగరాజు, పూలపల్లి రాజశేఖర్ రెడ్డి,మందుల వెంకటేష్, చుక్క యాదగిరి, గూడెపు వెంకన్న, పయ్యావుల సాయికుమార్, గూడెపు సంధ్య, సులోచన, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలి.

- జిల్లా కలెక్టర్ అంకిత్.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక** జిల్లాలో డా. బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్, భద్రాద్రి కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, డా. బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డా. బాబూ జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో సుదీర్ఘకాలం విశిష్ట సేవలు అందించి, సామాజిక న్యాయ సాధనకు కృషి చేసిన మహానేత అని కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, ఉన్నత స్థాయికి ఎదగాలంటే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలో అనేక శాఖలకు మంత్రిగా సేవలందించడమే కాకుండా దేశ ఉప ప్రధానిగా కూడా సమర్థవంతంగా పనిచేసి ప్రజాసేవకు అంకితభావంతో నిలిచారని తెలిపారు.

మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో వివక్ష లేకుండా సమానత్వంతో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణు గోపాల్, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ నాయకులు సాబీర్ పాషా, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం. శ్రీలత, జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ దాసరి శ్రీనివాస్, కో-కన్వీనర్లు చదలవాడ సూరి, కూసపాటి శ్రీనివాస్, మంద హనుమంతు, మద్దెల సూరి తదితరులు, శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 199 వ జయంతి వేడుకలు.



**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక** ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కామ్యూనిటీహాల్ సమీపంలో ని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పుట్ట ప్రశాంత్ మాదిగ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది,

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గంగారపు శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి,మరియు మరో ముఖ్య అతిథి గ్రామా సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలీయా పాల్గొని ముందుగ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగినది.


అనంతరం గంగారపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ స్వాతంత్ర సమరయోధులు,సంఘసంస్కర్త భారతదేశ మాజీ ఉప ప్రధాని శ్రీ బాబు జగ్జీవన్ రామ్ భారతీయ కుల వ్యవస్థలోని వెనుకబడిన సామాజిక వర్గం చమరు కులంలో జన్మించారుభారత పార్లమెంట్ లో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించిన మహా మేధావి మహాత్మా గాంధీ 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో కీలకపాత్ర పోషించారు. జగ్జీవన్ గారు 1935లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యారులి ఆ తర్వాత గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని నిర్వహించాడు. 1946లో బాబు జగ్జీవన్ జవహర్ లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు భారత దేశపు మొట్ట మొదటి క్యాబినెట్ కార్మిక మంత్రి, భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు సామాజిక న్యాయం రాజ్యాంగంలో పొందుపరుచబడిందని నిర్ధారించారు.అతను భారత జాతీయ కాంగ్రెస్ సభ్యులుగా 40 సంవత్సరాల కు పైగా వివిధ శాఖల క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు శ్రీ బాబు జగ్జీవన్ రామ్ గారు 1971లో యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణ మంత్రిగా ఉన్నారు ఫలితంగా బంగ్లాదేశ్ ఏర్పాటుకు సుగమం ఏర్పడింది భారతదేశంలో హరిత విప్లవం భారత వ్యవసాయాన్ని ఆధునికరించడంలో జగ్జీవన్ రామ్ గారు అందించిన సహకారం కేంద్ర వ్యవసాయ మంత్రిగా తన రెండు పదవీ కాలల్లో 1974 కరువు సమయంలో ఆహార సంక్షోభాన్ని నివారించడానికి అదనపు మంత్రిత్వ శాఖను నిర్వహించామని కోరినప్పుడు అంగీకారం తెలపడం ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన విషయంలి భారత అత్యవసర స్థితి సమయంలో 1975 -77 ప్రధాని ఇందిరాగాంధీకి మద్దతు ఇచ్చినప్పటికీ 1977లో కాంగ్రెస్ ని విడిచిపెట్టి జనతా పార్టీ కూటమిలో చేరారు తరువాత కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ పార్టీతో పాటు జగ్జీవన్ రామ్ భారత ఉప ప్రధానమంత్రిగా పనిచేశారు 1977 -79 తర్వాత 1981 లో జగ్జీవన్ రామ్ గారు భారత జాతీయ కాంగ్రెస్ (జె )ను స్థాపించాడు మరణం తర్వాత జగ్జీవన్ రామ్ స్వతంత్ర భారతదేశం మొట్టమొదటి క్యాబినెట్ లో చివరిగా జీవించి ఉన్న చివరి తాత్కాలిక మంత్రి జీవించి ఉన్న చివరి సభ్యుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సుదర్శన్ రెడ్డి బిజెపి జిల్లా నాయకులు, పుట్ట ప్రదీప్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గంగారపు శ్యామ్ వార్డ్ 13 వ మెంబర్, పుట్ట ప్రణయభాస్కర్ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, పుట్ట జ్ఞానరాజ్, పుట్ట చైతన్య, పల్లెపెల్లి అనిల్, చింత తిలక్, మేకల రాజు, కొట్టె ప్రణయభాస్కర్, కొట్టె అనుచరణ్, కొట్టే దేవరాజు కొట్టె రవి, పొలుమారి రాజు, మాచెర్ల పౌలు, తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రీస్తు పునరుద్దాన సువార్త .

**భారీగా ర్యాలీ నిర్వహించిన క్రైస్తవులు.**

**చింతకాని న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక** చింతకాని మండల కేంద్రంలోని క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రీస్తు పునరుద్దాన సువార్తను ఆదివారం తెల్లవారుజామున క్రీస్తు చనిపోయి మూడవ రోజున తిరిగి లేచాడని చింతకాని మండలం కేంద్రంలోని వీధి,వీధి తిరుగుతూఏసుక్రీస్తు మనుషుల పాపలు తూడ్చి వేయటానికి, పాపుల నిమిత్తం కల్వరి సిలువలో రక్తం చిందించి, ప్రాణం పెట్టి, మరణించి తిరిగి మూడవ రోజున లేవడం పునరుద్ధానం మరణం పై విజయం అని మానవులు కూడా మరణించిన తర్వాత తిరిగి లేస్తారు అని గుర్తుగా ఈస్టర్ నుప్రపంచవ్యాప్తంగాజరుపుకుంటారని ప్రపంచంలో యేసు క్రీస్తు వారు ఒక్కరే తిరిగి లేచారని, క్రీస్తు మరణ రాజ్యసవార్తను ప్రజలకు వివరిస్తూభారీ ర్యాలీగా సువార్త చేసి, ప్రతి ఒక్కరికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు .

ఈ కార్యక్రమంలోపాస్టర్స్ క్రైస్ట్ చర్చ్ వేముల ఆకాష్, జంగాల ప్రకాష్ బాబు,బైబిల్ మిషన్ విజయరత్నం, విశ్వవాణి విజయ్ కుమార్,సీ ఎస్ఐ సుందర్ కాంత్, మిస్పా పాస్టర్ రాజేష్, క్రీస్తు సంఘం దావీద్, రవీంద్రబాబు, క్రైస్ట్ చర్చ్ సంఘ పెద్దలు వేముల శ్రీనివాసరావు, తలారి లక్ష్మీనారాయణ,వెర్పుల అనిల్ కుమార్, గుండెపోగు నరేష్,గంటెల కిరణ్,వేముల కిషోర్,తలారి గోపి, అన్ని సంఘాల సభ్యులు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పాలకుర్తి మండల కేంద్రంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా భారి ర్యాలీ....



**పాలకుర్తి ఏప్రిల్ 05 (న్యూస్ ఇండియా ప్రతినిధి )**జనగాం జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా భారి ర్యాలీ.ముఖ్య అతిధులుగా విచ్చేసిన ప్రముఖ స్వామిజీలు,అతిరథమహారధులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు,విద్యార్ధులు, భక్తజన సందోహం...అంగరంగ వైభవంగా స్వాగతం పలికిన కమిటీ నిర్వాహకులు.

## బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు.....




**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 5( న్యూస్ ఇండియా ప్రతినిధి )**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం లోని గాజులరామారం చౌరస్తాలో బాబు జగ్జీవన్ రావ్ జన్మదిన వేడుక సందర్భంగా బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఫాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్ గాజులు రామారావు చౌరస్తాలో బాబు జగ్జీవన్ రావు విగ్రహానికి పూలమాలను వేసి తరువాత తను మాట్లాడుతూ

బాబు జగ్జీవన్ రావు స్వాత్రంత్ర సమర యోధుడు, సంఘ సంస్కార్త, రాజకీయావేత జగ్జీవన్ రావు అని కొనియాడారు. కనుక అయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని వారు గుర్తు చేశారు. తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, డి ఐ లక్ష్మణ్, శివయ్య, ప్రసాద్, దేవునిసతయ్య, కిష్టయ్య, నిరుడి పెంటయ్య, రంజాన్ సమ్మయ్య, గౌస్, తదితర నాయకులు పాల్గొన్నారు,

## ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ( న్యూస్ ఇండియా ప్రతినిధి )**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం లో జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యశాఖ అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆసుపత్రుల పనితీరు, అభివృద్ధి పనులు, ఆరోగ్యశ్రీ సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలవుతున్న ఆరోగ్యశ్రీ సేవలపై పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల పరిధిలో కొనసాగుతున్న నూతన నిర్మాణాలు, మరమ్మత్తుల పనుల పురోగతిని సమీక్షించి, పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రతి ఆసుపత్రి వారీగా సూపరింటెండెంట్ల నుండి సమాచారం సేకరించి, ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలు, సిబ్బంది కొరత, వైద్యుల లభ్యత వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మరుగుదొడ్ల మరమ్మత్తుల అవసరాన్ని సూపరింటెండెంట్ తెలియజేయగా, వెంటనే అవసరమైన చర్యలు తీసుకుని పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రులపైనే విశ్వాసం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల వివరాలను సమీక్షించి, అవసరమైన చోట సేవలను మరింత మెరుగుపరచాలని తెలిపారు.

ప్రతి ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు తగిన శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని బ్లడ్ బ్యాంకుల పనితీరు, రక్త నిల్వల వివరాలను పరిశీలించి అత్యవసర సేవలకు ఎటువంటి లోటు లేకుండా చూడాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి కృషి చేయాలని, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో నమోదు అవుతున్న సికిల్ సెల్ అనీమియా కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేసుల అధికత ఉన్న మండలాలు, పరీక్షల నిర్వహణ విధానం, కిట్ల లభ్యతపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డిసిహెచ్ఓ రవిబాబు , ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ ఇండియా నిజం మా ఇజం

# ఎడిటోరియల్

## ట్రబుల్ లో ఎమ్మెల్యేలు వీరేనట

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంగా చెప్పేశారు. తరచూ వివాదాల్లో ఇరుక్కునే ఎమ్మెల్యేలు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగానే మిగిలిపోతారని చెప్పారు. అంటే ఎమ్మెల్యేలకు స్పష్టంగా చెప్పేశారు. ఏమాత్రం వివాదాల్లో ఇరుక్కున్నా తాను టిక్కెట్ ఇచ్చేది లేదని ఆయన చెప్పకనే చెప్పారు. ఇప్పటికిప్పుడు చర్యలు ఉండకపోవచ్చు. కానీ భవిష్యత్ లో మాత్రం వారికి టిక్కెట్ ఇచ్చే విషయంలో ఈ వివాదాలన్నీ కౌంట్ అవుతాయని చంద్రబాబు ఎమ్మెల్యేలకు చెప్పకనే చెప్పేశారు. ఎన్ని సార్లు చెప్పినప్పటికీ వారు చెవికెక్కించుకోకపోవడంతో పాటు ఇంకా ఎమ్మెల్యేలు రెచ్చిపోతుండటంతో చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారంటున్నారు.

**వరస వివాదాల్లో...**

ఇటీవల టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు వరస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. అనేక మంది అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇప్పటి వరకూ చాలా మంది ఎమ్మెల్యేలు గీత దాటినట్లు చంద్రబాబుకు స్పష్టంగా అర్థమయింది. వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ అయితే తీసుకున్నారు కానీ, సస్పెండ్ చేయలేదు. సస్పెండ్ చేయకపోనంత మాత్రాన చేతకాని తనం అని చూస్తూ ఊరుకోవద్దని అన్నారు. గీత దాటితే ఖచ్చితంగా సస్పెండ్ చేస్తామని చెప్పారు. అలాగే వైఖరి కొనసాగితే సింగిల్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతారని హింట్ ఇచ్చారు.

**వీరికి టిక్కెట్లు కష్టమేనట...**

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అబ్దుల్ నజీర్, నరసరావు పేట ఎమ్మెల్యే అరవింద బాబు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం లుమాత్రం ట్రబుల్ లో ఉన్నట్లేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వెను వెంటనే వీరిపై చర్యలు తీసుకోకపోయినప్పటికీ వచ్చే ఎన్నికల్లో వీరి స్థానంలో కొత్త నేతలకు అవకాశం ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధమయినట్లు తెలిసింది. ఎవరు తోక జాడించినా.. ఇప్పటికిప్పుడు వచ్చే ప్రమాదం లేదు కానీ, వచ్చే ఎన్నికల్లో మాత్రం టిక్కెట్ లభించదన్నది స్పష్టంగా చంద్రబాబు చెప్పినట్లయింది. ఇప్పటికైనా ఎమ్మెల్యేల్లో మార్పు వస్తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# పని చేయకపోయినా రోజంతా నీరసంగా అనిపిస్తుందా?



ఏ పని చేయకపోయినా ఒక్కోసారి శరీరం బరువుగా అనిపించడం, ఏ పని చేయాలనిపించకపోవడం, చిన్న చిన్న పనులు కూడా కష్టంగా తోచడం జరుగుతుంది. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు సాధారణంగా థైరాయిడ్ పరీక్షలు, షుగర్ పరీక్షలు, బి12, విటమిన్ డి వంటి రక్త పరీక్షలు చేయించుకుంటూ ఉంటారు. కొంత మందికి రోజంతా ఏ పని చేయకపోయినా అలసటగా అనిపిస్తుంది. శరీరం బరువుగా అనిపించడం, ఏ పని చేయాలనిపించకపోవడం, చిన్న చిన్న పనులు కూడా కష్టంగా తోచడం జరుగుతుంది. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు సాధారణంగా థైరాయిడ్ పరీక్షలు, షుగర్ పరీక్షలు, బి12, విటమిన్ డి వంటి రక్త పరీక్షలు చేయించుకుంటూ ఉంటారు. కానీ రిపోర్టులు సాధారణంగానే వస్తాయి. అయినప్పటికీ అలసట తగ్గదు. నిజానికి ఇది ఆందోళన కలిగించే విషయం. ఇలా తరచూ వేదించే నీరసాన్ని చాలా మంది పెద్దగా పట్టించుకోరు. బలహీనతగా భావించి కొట్టిపారేస్తుంటారు. కానీ దీని వెనుక కొన్ని ఆరోగ్య సమస్యలు దాగి ఉండవచ్చు. ఈ సమస్యలు క్రమంగా శరీర శక్తిని, మానసిక స్థితిని ప్రభావితం చేస్తాయి. సకాలంలో శ్రద్ధ పెట్టకపోతే ఇవి దీర్ఘకాలిక సమస్యలకు కారణం అవుతాయి. అందువల్ల ఈ లక్షణాలను సకాలంలో అర్థం చేసుకోవడం, దాని వెనుక ఉన్న ఖచ్చితమైన కారణాన్ని కనుగొనడం చాలా ముఖ్యం. చాలా కాలంగా అలసటగా ఉంటే ఎంత విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా మెరుగుపడదు. బలహీనత, నిద్ర తర్వాత కూడా పునరుత్తేజం లేకపోవడం, ఏకాగ్రత లోపం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఈ లక్షణాలు స్లీప్ అప్నియాకు కారణం కావచ్చు. నిద్రలో శ్వాస పదేపదే ఆగిపోతుంది. దీనివల్ల నిద్ర పూర్తిగా పట్టదు. దీని వలన రాత్రంతా బాగా నిద్రపోయిన తర్వాత కూడా పగటిపూట నిద్రమత్తు వదలదు. తలనొప్పులు, అలసట వంటి సమస్యలు తలెత్తుతాయి. థైరాయిడ్ లేదా ఇతర హార్మోన్ల రుగ్మతల వంటి శరీరంలోని హార్మోన్ల అసమతుల్యతలు శరీర శక్తిని ప్రభావితం చేస్తాయి. ఇది అలసట, మానసిక స్థితిలో మార్పులు, బరువులో మార్పుల వంటి సమస్యలకు దారితీయవచ్చు. డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలు కూడా శరీరాన్ని అలసిపోయేలా చేస్తాయి. ఇలాంటి పరిస్థితిలో వ్యక్తి మానసికంగా బలహీనంగా ఉంటారు. ఇది శరీరంలో శక్తి లేకపోవడానికి, నిరంతర అలసటకు దారితీస్తుంది.

పగటిపూట అలసటను గుర్తించడానికి మీ శరీరం ఇచ్చే సంకేతాలపై శ్రద్ధ పెట్టడం ముఖ్యం. ప్రతిరోజూ తగినంత నిద్రపోయిన తర్వాత కూడా మీకు అలసటగా అనిపిస్తే అది సాధారణం కాదని గ్రహించాలి. ఏకాగ్రత లోపం, తరచుగా తలనొప్పి, చిరాకు, పనిపై ఆసక్తి కోల్పోవడం వంటివి లక్షణాలు కనిపిస్తాయి. శరీరం బరువుగా అనిపించి, ఏ పని చేయకపోవడం, శక్తి కోల్పోయినట్లు అనిపించడం కూడా ఒక లక్షణమే. అంతేకాకుండా నిద్రలో గురక పెట్టడం, ఆయాసం, ఉదయం నిద్రలేచిన తర్వాత కూడా ఉత్సాహంగా అనిపించకపోవడం వంటివి నిద్ర సంబంధిత సమస్యలను సూచిస్తాయి. ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే, వైద్యుడిని సంప్రదించడం అవసరం. అలసటను నివారించడానికి అత్యంత ముఖ్యమైన విషయం సరైన దినచర్యను పాటించడం. ప్రతిరోజూ 7 నుండి 8 గంటల పాటు చక్కగా నిద్రపోవాలి. పడుకునే సమయాన్ని నిర్ణయించుకోవాలి. శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా పండ్లు, కూరగాయలు, ప్రోటీన్‌తో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పని వ్యాయామం శరీర శక్తిని పెంచి, అలసటను తగ్గిస్తుంది. అలాగే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం, మీకు ఇష్టమైన కార్యకలాపాలను అలవాటు చేసుకోవాలి. రాత్రి పడుకునే ముందు స్క్రీన్ సమయాన్ని తగ్గించుకోవాలి. మొబైల్ వాడకం తగ్గించాలి. అయినా ఈ సమస్య కొనసాగితే వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలి.


# వేసవిలో ఏ డ్రింక్ మిస్ అవ్వకూడదు



వేసవి తాపాన్ని తగ్గించేందుకు శ్రావణిస్ కిచెన్ రుచికరమైన, ఆరోగ్యకరమైన డ్రింక్ అందిస్తుంది. సగ్గుబియ్యం, పాలు, ఫూల్ మఖానా, డ్రై ఫ్రూట్స్, తాజా పండ్లతో సులభంగా తయారుచేసే ఈ పానీయం వేసవిలో శరీరానికి చలువనిస్తుంది. దీని తయారీ విధానం చాలా సులభం, ఆరోగ్యాన్ని కూడా అందిస్తుంది. వేసవి కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచడానికి, తక్షణ శక్తిని అందించడానికి శ్రావణిస్ కిచెన్ రుచికరమైన, ఆరోగ్యకరమైన పానీయాన్ని అందిస్తుంది. ఈ "సమ్మర్ స్పెషల్ బెస్ట్ హెల్తీ డ్రింక్" చాలా సులభంగా తయారుచేసుకోవచ్చు. దీని రుచి అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యం దృష్టిలో చూసినా ఇది చాలా మంచి పానీయం. ఈ పానీయాన్ని తయారుచేయడానికి, ముందుగా స్టవ్‌పై కడాయిని పెట్టి అందులో 1/2 లీటరు పాలను తీసుకోవాలి. పాలు పొంగే వరకు వేడి చేయాలి. పాలు వేడయ్యేలోపు, ఒక గంట ముందు నానబెట్టిన సగ్గుబియ్యాన్ని సిద్ధంగా ఉంచుకోవాలి. సగ్గుబియ్యం నానబెట్టకపోతే, వాటిని ముందుగా నీటిలో బాగా ఉడికించి మిగిలిన ప్రక్రియను కొనసాగించవచ్చు. పాలు పొంగిన తర్వాత, నానబెట్టిన సగ్గుబియ్యాన్ని పాలలో వేసి రెండు మూడు నిమిషాలు ఉడికించాలి. సగ్గుబియ్యం నాని ఉండటం వలన త్వరగా ఉడికిపోతాయి. మధ్యమధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం సాఫ్ట్‌గా మారిన తర్వాత, తదుపరి దశకు వెళ్లవచ్చు.మంచి రుచి కోసం.. ఈ డ్రింక్‌కు మంచి రుచిని అందించడానికి, మరోపక్కన చిన్న మిక్సీ గిన్నెలో 1/4 కప్పు ఫూల్ మఖానా, మంచి ఫ్లేవర్ కోసం మూడు నాలుగు యాలకులు, నాలుగైదు జీడిపప్పు పలుకులను తీసుకోవాలి. ఒకవేళ ఫూల్ మఖానా అందుబాటులో లేకపోతే, వాటికి బదులుగా అదనపు జీడిపప్పును ఉపయోగించవచ్చు. ఈ పదార్థాలను మెత్తని పొడిలా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. సగ్గుబియ్యం చక్కగా ఉడికిన తర్వాత, అందులో రుచికి సరిపడా చక్కెరను (సుమారు 4 టేబుల్ స్పూన్లు) కలపాలి. స్వీట్ తక్కువగా ఇష్టపడేవారు 3 టేబుల్ స్పూన్లు తీసుకోవచ్చు. ఆ తర్వాత, ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న ఫూల్ మఖానా, యాలకులు, జీడిపప్పు పొడిని వేసి ముద్దలు కట్టకుండా బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మధ్యమధ్యలో కలుపుతూ మూడు నాలుగు నిమిషాలు ఉడికించాలి. ఈ సమయంలో డ్రింక్ కాస్త చిక్కబడుతుంది. పదార్థాలన్నీ చక్కగా ఉడుకుతాయి. మూడు నాలుగు నిమిషాల తర్వాత స్టవ్ ఆఫ్ చేసి, మిశ్రమాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి. చల్ల చల్లగా తాగాలనుకుంటే, పూర్తిగా చల్లారిన తర్వాత ఒక అరగంట నుండి గంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి.

హెల్దీ డ్రింక్ కోసం.. పూర్తిగా చల్లారిన తర్వాత, పాల మిశ్రమం కాస్త చిక్కగా, క్రీమీగా మారుతుంది. పండ్లు ఇష్టపడనివారు ఈ మిశ్రమాన్ని అలాగే తాగినా రుచికరంగా ఉంటుంది. అయితే, మరింత రుచి, పోషకాల కోసం, డ్రింక్‌లో కొన్ని తాజా పండ్లు, డ్రై నట్స్ కలుపుకోవచ్చు. 1/4 కప్పు దానిమ్మపండు గింజలు, 1/2 కప్పు కర్బూజ పండు ముక్కలు, 1/4 కప్పు గ్రేప్స్ ముక్కలు తీసుకోవచ్చు. అరటిపండు, ఆపిల్, పుచ్చకాయ వంటి ఇతర పండ్లను కూడా చేర్చవచ్చు. వీటితో పాటు, ఒక టేబుల్ స్పూన్ సన్నగా కట్ చేసిన కాజు ముక్కలు, ఒక టేబుల్ స్పూన్ పాంప్కిన్ సీడ్స్, నల్ల ద్రాక్షలను కూడా కలుపుకోవాలి. ఈ పదార్థాలన్నింటినీ పాల మిశ్రమంలో వేసి బాగా కలిపితే, టేస్టీగా, కలర్‌ఫుల్‌గా, ఆరోగ్యకరమైన ఫ్రూట్ డ్రింక్ సిద్ధంగా ఉంటుంది. వేసవిలో తప్పకుండా ప్రయత్నించవలసిన ఈ పానీయం శరీరాన్ని చల్లబరచడమే కాకుండా, పోషకాలను కూడా అందిస్తుంది. శ్రావణిస్ కిచెన్ నుంచి ఈ రెసిపీని ప్రయత్నించి, వేసవి తాపాన్ని తగ్గించుకోండి.

# గోళ్లు కొరికే అలవాటు ఉందా..!



చాలా మందికి గోళ్లు కొరికే అలవాటు ఉండడం మనం చూస్తుంటాం. ఇది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు.. మీ మెదడులో దాగి ఉన్న ఒత్తిడికి, ఆందోళనకు ఇదొక సంకేతం. వైద్యులు దీన్ని అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్‌లో ఒక భాగంగా చెబుతున్నారు. కానీ ఈ అలవాటు వల్ల కలిగే ఇన్ఫెక్షన్లు గ్యాంగ్రీన్ లాంటి భయంకరమైన వ్యాధులకు దారితీస్తాయి. ఖాళీగా ఉన్నప్పుడో, ఒత్తిడిలో ఉన్నప్పుడో తెలియకుండానే వేళ్లను నోట్లో పెట్టుకుని గోళ్లు కొరుకుతున్నారా? అయితే మీరు ప్రమాదంలో ఉన్నట్లే.. మనకు ఇది కేవలం ఒక చెడు అలవాటులా అనిపించవచ్చు. కానీ వైద్య పరిభాషలో దీనిని డెర్మటోఫాజియా అని పిలుస్తారు. ఈ చిన్న అలవాటు చివరికి మీ వేలిని తొలగించే స్థాయికి తీసుకువెళ్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గోళు లేదా వేళ్ల చుట్టూ ఉన్న చర్మాన్ని కొరకడం అనేది ఒక రకమైన అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ అని వైద్యులు వర్గీకరిస్తున్నారు. తీవ్రమైన ఆందోళన లేదా ఒత్తిడికి గురైనప్పుడు మెదడును శాంతపరచుకోవడానికి చేసే ఈ ప్రయత్నం కాలక్రమేణా ఒక వ్యసనంగా మారుతుంది. దీనినే శరీరంపై దృష్టి సారించే పునరావృత ప్రవర్తన అని కూడా పిలుస్తారు.ఈ అలవాటు వల్ల కలిగే నష్టాలు ఊహకందని విధంగా ఉంటాయి. నెయిల్ బెడ్ నాశనం: నిరంతరం కొరకడం వల్ల గోరు పెరగడానికి సహాయపడే నెయిల్ బెడ్ దెబ్బతింటుంది. దీనివల్ల గోరు సరిగ్గా పెరగకుండా చర్మంలోకి లోతుగా కుంగిపోయి భరించలేని నొప్పిని కలిగిస్తుంది.పరోనిషియా ఇన్ఫెక్షన్: గోళ్ల మూలల్లో ఉండే బ్యాక్టీరియా లాలాజలం ద్వారా రక్తంలో కలిసిపోతుంది. దీనివల్ల గోళ్ల చుట్టూ చీము పేరుకుపోయే పరోనిషియా ఇన్ఫెక్షన్ వస్తుంది. గ్యాంగ్రీన్ ముప్పు: ఈ ఇన్ఫెక్షన్ ఎముకలోకి లోతుగా చేరితే, ఎముక కుళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. దీనినే గ్యాంగ్రీన్ అంటారు. పరిస్థితి విషమిస్తే ఇన్ఫెక్షన్ శరీరమంతా పాకకుండా ఉండటానికి ప్రభావితమైన వేలిని శస్త్రచికిత్స ద్వారా తొలగించాల్సి వస్తుంది.మీరు లేదా మీ పిల్లలు ఈ సమస్యతో బాధపడుతుంటే ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోండి.. గోళ్లను కత్తిరించుకోండి: గోళ్లను ఎప్పుడూ చాలా పొట్టిగా ఉంచుకోవడం వల్ల వాటిని కొరికే అవకాశం తగ్గుతుంది.చేదు రుచి గల పేస్ట్: గోళ్ల చివర్లకు సురక్షితమైన, చేదుగా ఉండే పేస్ట్‌లను పూయండి. నోట్లో పెట్టుకోగానే ఆ చేదు వల్ల అలవాటు తగ్గుతుంది. మానసిక ప్రశాంతత: ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రతిరోజూ ప్రాణాయామం లేదా వ్యాయామం చేయండి. సమస్య అదుపు తప్పితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా చర్మవ్యాధి నిపుణుడిని లేదా థెరపిస్ట్‌ను సంప్రదించడం ఉత్తమం.

## నేహా శర్మ లుక్ మిస్ అవ్వడం చాలా బాగుంది



# నిర్మాతగా దూసుకుపోతున్న సుకుమార్!



దర్శకుడిగా సుకుమార్ ఎలాంటి విజయాలు అందించారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. -ఆర్య- నుంచి -పుష్ప 2- వరకూ ఎన్నో వైవిధ్యమైన చిత్రాల్ని అందించారు. ప్రత్యేకించి -పుష్ప- విజయంతో స్టార్ డైరెక్టర్ గా ఇండియాలోనే ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. ప్రస్తుతం ఇండియాన్ టాప్ 5 డైరెక్టర్లలో ఆయన ఒకరు. ఇప్పుడా యనతో సినిమాలు చేయడానికి బాలీవుడ్ సహా స్టార్ హీరోలంతా క్యూలో ఉన్నారు. అలాగే తెలివైన శిష్యులను అందించడంలోనూ ఆయనే ముందున్నారు. ఇప్పటికే ఆయన స్కూల్ నుంచి కొంత మంది శిష్యులు డైరెక్టర్లగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే నిర్మాతగానూ సుకుమార్ మరింత బిజీ అవుతున్నారు. ఈ విషయంలో ఏ స్టార్ డైరెక్టర్ లేనంత బిజీగా సుకుమార్ కనిపిస్తున్నారు. వరుసగా తన సొంత బ్యానర్ సుకుమార్ క్రియేటివ్ వర్క్స్ లో సినిమాలు నిర్మిస్తూ హైలైట్ అవుతున్నారు. -కుమారి 21 ఎఫ్- తో నిర్మాతగా తెరంగేట్రం చేసిన లెక్కలు మాస్టారు అనంతరం అదే సినిమా రీమేక్ కు సమర్పకుడిగా వ్యవహరించారు. -100 పర్సంట్ కాదల్- ను సమర్పించారు. అటుపై బుచ్చి బాబు దర్శకత్వం వహించిన -ఉప్పెన- కు నిర్మాతగా పని చేసారు. -విరూపాక్ష- చిత్ర నిర్మాణంలోనూ భాగమయ్యారు. -మంజుమ్మల్ బోయ్స్- లాంటి మలయాళ చిత్రాన్ని తెలుగు అనువాదంలో ఆయన హస్తం ఉంది. ప్రస్తుతం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తోన్న -పెద్ది- సినిమాకు నిర్మాతగా కొనసాగుతున్నారు. మరో రెండు బ్యానర్లతో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే నాగ చైతన్య హీరోగా కార్తీక్ దండు తెరకెక్కిస్తోన్న -వృషకర్మ- సినిమా నిర్మాణంలో భాగమయ్యారు. అసలు విషయం ఏంటంటే ఈ సినిమాలన్నింటినీ తన శిష్యులు డైరెక్ట్ చేయడం ఇంట్రెస్టింగ్. ఆ కథల్లో సుకుమార్ హస్తం కూడా ఉంది. రచన విభాగంలో ఆయన ఇన్వాల్వ్ అవుతూ అవసరమైన ఇన్ పుట్స్ ఇస్తున్నారు.ఆ రకంగా తన బ్రాండ్ ను, పేరునే పెట్టుబడి పెడుతున్నారు. తాజాగా ప్రియదర్శి హీరోగా కూడా ఓ సినిమా నిర్మిస్తున్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిది. బన్నీ వాసుతో కలిసి సుకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. ఇవిగాక మరో రెండు..మూడు చిత్రాలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ఓ స్టార్ డైరెక్టర్ నిర్మాతగా ఇంత బిజీగా ఉండటం అన్నది సుకుమార్ కే చెల్లింది. -పుష్ప 2- రిలీజ్ అయిన దగ్గర నుంచి సుకుమార్ నిర్మాణంలోనే బిజీగా ఉంటున్నారు. త్వరలోనే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కొత్త చిత్రం ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. -పెద్ది- రిలీజ్ అనంతరం చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారు.

## శ్రేయా ధన్వంతరి కాన్ఫిడెంట్ న్యూ లుక్‌లో టోన్డ్ అబ్స్‌ని ప్రదర్శించింది



# ఎట్టకేలకు యష్ స్టార్‌డమ్‌ని ఒప్పుకున్న హిందీ స్టార్



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఉత్తరాది - దక్షిణాది మధ్య ఉన్న సరిహద్దులు చెరిగిపోతున్నాయి. ఒకప్పుడు సౌత్ స్టార్ల గొప్పతనాన్ని అంగీకరించడానికి బాలీవుడ్ ప్రముఖులు అంత సులభంగా ముందుకు వచ్చేవారు కాదు. దక్షిణాది దర్శకులు లేదా స్టార్లు సంచలన విజయాలు నమోదు చేసినా.. వారిని ప్రశంసించే విషయంలో హిందీ నటులు కొంత తటపటాయించేవారు. సందీప్ రెడ్డి వంగా వంటి ప్రతిభావంతులైన దర్శకులను కూడా ఏదో ఒక కోణంలో విమర్శించేందుకే వారు మొగ్గు చూపేవారు. కనీసం ప్రమోషన్ల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు రావడానికి కూడా ఆసక్తి చూపని బాలీవుడ్ స్టార్లు.. ఇప్పుడు మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా పాన్ ఇండియా మార్కెట్ కోసం దక్షిణాదికి క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఒక ప్రముఖ హిందీ నటుడు దక్షిణాది ట్యాలెంటెడ్ హీరో స్టార్‌డమ్‌ను బహిరంగంగా కీర్తించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సాధారణంగా బాలీవుడ్ హీరోలు తమ ఇమేజ్ దెబ్బతింటుందేమో అన్నట్టుగా ఇతర హీరోలను పొగడటానికి వెనుకాడతారు. కానీ హిందీ సూపర్ స్టార్ రణబీర్ కపూర్ మాత్రం రాకింగ్ స్టార్ యష్ విషయంలో చాలా నిజాయితీగా స్పందించారు. యష్‌కు ఉన్న అసాధారణమైన స్టార్‌డమ్‌ను ఆయన మనస్ఫూర్తిగా అంగీకరించడమే కాకుండా.. ఒక అంతర్జాతీయ వేదికపై ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. నితీష్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న -రామాయణం-సినిమాకు సంబంధించి లాస్ ఏంజిల్స్ - న్యూయార్క్ నగరాల్లో జరిగిన అంతర్జాతీయ ఈవెంట్లలో రణబీర్ కపూర్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ చిత్రంలో రావణుడి పాత్రను పోషిస్తున్న యష్ గురించి మాట్లాడుతూ.. -రావణుడి పాత్రకు అవసరమైన గంభీరమైన వ్యక్తిత్వం (ఆరా) , పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ యష్‌కు పుష్కలంగా ఉన్నాయి-- అని కొనియాడారు. యష్ స్టార్‌డమ్ ఈ సినిమాకు పెద్ద బలం అని అంగీకరించడం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాలో సీత పాత్రకు సాయి పల్లవిని ఎంపిక చేయడంపై కూడా రణబీర్ ప్రశంసలు కురిపించారు. సాయి పల్లవిని సీత గెటప్‌లో చూసిన మొదటి రోజే తన కంటే మెరుగైన నటి ఈ పాత్రకు ఉండరని తనకు, దర్శకుడికి అర్థమైందని ఆయన తెలిపారు. దాదాపు రూ. 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. మొదటి భాగం 2026 దీపావళికి.. రెండవ భాగం 2027 దీపావళికి విడుదల చేసేలా మేకర్స్ ప్లాన్ చేశారు.ఇటీవల విడుదలైన టీజర్‌లో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా రాజసం ఉట్టిపడేలా కనిపించగా.. టీజర్ ముగింపులో యష్ రావణుడిగా పుష్పక విమానం వైపు నడుస్తున్న గ్లింప్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. ఇందులో సన్నీ డియోల్ ఆంజనేయుడిగా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ప్రమోట్ చేస్తున్నారు. ఒక పక్కా గ్లోబల్ విజన్‌తో నిర్మాత నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. రామాయణం భారతీయ సినిమా స్థాయిని ప్రపంచ పటంలో మరో మెట్టు ఎక్కించాలని అందరూ కోరుకుంటున్నారు.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com